TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 166 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శనివారం.10.01.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## గొడవలొద్దు.. నీళ్లు కావాలి

రంగారెడ్డి:అమృత్ తెలంగాణ: నదీజలాల విషయంలో పక్క రాష్ట్రాలతో వివాదాలు కోరుకోవడం లేదని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నదీ జలాలకు సంబంధించి పంచాయతీ కావాలా..! నీళ్లు కావాలా..! అని అడిగితే తెలంగాణ రాష్ట్రానికి నీళ్లు కావాలని కోరుకుంటామని చెప్పారు. కృష్ణా జలాల విషయంపై కూర్చొని మాట్లాడుకుందామని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల్‌లోని ఈ–సిటీలో నెలకొల్పిన సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందన్నారు.




నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ది పొందాలన్న ఆలోచన కాంగ్రెస్‌కు లేదన్నారు. రాజకీయాలకతీతంగా పరిష్కారం కోసం అందరూ సహకరించాలని ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు. మన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు ఈ వేదిక ద్వారా విజ్ఞప్తి చేస్తున్నట్టు ప్రకటించారు. "పక్క రాష్ట్రాలతో తెలంగాణ వివాదాలను కోరుకోవడం లేదు. న్యాయస్థానాల ముందుకు లేదా మరెవరి వద్దనో పంచాయితీ పెట్టుకునే కన్నా కూర్చొని చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలి" అని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన పాలమూరు–రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి, ఎస్‌ఎల్బీసీ, బీమా, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాల వల్ల పర్యావరణం, సీడబ్ల్యూసీ నుంచి సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన నిధులు, అనుమతులు కూడా రావడం లేదని, తద్వారా రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని చెప్పారు. రాజకీయ ప్రయోజనాలకన్నా ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసం ఆలోచి స్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పోర్టు కనెక్టివిటీ లేని తెలంగాణకు మచిలీపట్నం పోర్టుతో కనెక్టివిటీ కోసం 12 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, రైల్వే కనెక్టివిటీతో సహా అనుమతి అడిగామని, ఆ కనెక్టివిటీని అభివృద్ధి చేయాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమని చెప్పారు. ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి చెందాలంటే తెలంగాణ సహకారం అవసరం ఉంటుందని, పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారమవు తాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలతో పరస్పర సహకారాన్ని మాత్రమే కోరుకుంటున్నామని చెప్పారు.

తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ మూడు భాగాలుగా అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశిస్తూ గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశామని వివరించారు. ఇందులో భాగంగా సుజెన్ మెడికేర్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ప్రపంచంలో జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, న్యూయార్క్‌తో పోటీ పడాలని సంకల్పించామని, అందులో భాగంగానే యువ పారిశ్రామిక వేత్తలు ప్రారంభించే పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఫార్మా రంగంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో నిలుస్తోందని, బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి దేశంలో తెలంగాణ నుంచి 40 శాతం ఉందని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. జర్మన్ టెక్నాలజీతో దక్షిణ భారత దేశంలోనే ఐవీ ఫ్లూయిడ్స్ తయారీలో గొప్ప సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రపంచమే మనవైపు చూసేలా ఫార్మా రంగంలో రాణిస్తున్నామన్నారు.

1995 నుంచి 2025 వరకు 30 ఏండ్ల నిరంతర శ్రమ వల్ల హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడుతోందని ముఖ్యమంత్రి చెప్పారు. మన దగ్గర చదువుకుని వెళ్లిన వారు గ్లోబల్ కంపెనీలకు సీఈవోలుగా ఉన్నారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే ప్రయివేట్ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ వల్ల ఇక్కడి భూముల ధరలు పెరుగుతాయని, అభివృద్ధికి అందరూ సహకరించాలని, సహకారం ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## జల జగడాలు వద్దు




రాజమహేంద్రవరం :అమృత్ తెలంగాణ: 'సముద్రంలో కలిసే నీళ్ల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య గొడవలు ఎందుకు? నీళ్లు వద్దూ గొడవలే కావాలని కొందరు బయల్దేరారు. కొందరు రాయలసీమ ఎత్తిపోతల అంటూ వివాదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. నాకు గొడవలు కాదూ తెలుగు జాతి ప్రయోజనాలు కావాలి. పోలవరం పూర్తయితే ఆ నీళ్లు తెలంగాణ కూడా వాడుకునే అవకాశం ఉంటుంది. వివాదాల వల్ల ఎలాంటి ఉపయోగమూ లేదు' అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలంలో ఆయన శుక్రవారం పర్యటించారు. తొలుత రాయవరం గ్రామంలో సర్వే చేసిన పంట భూములను పరిశీలించారు. అనంతరం రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. ఎటువంటి అవినీతి అక్రమాలకూ తావులేకుండా రైతులకు రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలను అందిస్తున్నామన్నారు.

రీసర్వే పూర్తి అయిన 6,688 గ్రామాల్లోని భూములకు సంబంధించి 22.33 లక్షల పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గోదావరి పుష్కరాలను వరుసగా మూడోమారు ముఖ్యమంత్రిగా నిర్వహించే అదృష్టం తనకు దక్కిందన్నారు. 2027 మార్చిలోగా పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. ఏటా మూడు వేల టిఎంసిల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయని, ఇందులో 300 టీఎంసీలు వాడుకుంటే వచ్చే నష్టం ఏమీ లేదని పేర్కొన్నారు. పోలవరాన్ని ఒక యజ్ఞంగా భావించి పూర్తి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ ప్రాజెక్టు పూర్తి కావడంలో జాప్యం జరిగిందన్నారు. గత పాలకుల తప్పిదాల వల్ల రూ.వెయ్యి కోట్లతో డయాఫ్రం వాల్ మళ్లీ కట్టాల్సి వస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టుతో నీటి ఎద్దడి లేకుండా చేయడమే లక్ష్యమని తెలిపారు. పట్టిసీమ కట్టి కృష్ణా డెల్టాలో వినియోగించుకుందామంటే వ్యతిరేకించారని విమర్శించారు.

కృష్ణా డెల్టాలో నీళ్లను పొదుపు చేసి శ్రీశైలం నుంచి రాయలసీమ ప్రాంతానికి తరలిస్తామన్నారు. కొందరు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ వివాదాలను పరిష్కరించడానికే రెండేళ్లు పట్టిందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టును పిపిపిలో కడుతుంటే ముద్దు కానీ, పిపిపి కింద మెడికల్ కాలేజీలు కడితే వద్దంటున్నారని విమర్శించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామన్నారు. దేశంలోకొచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికే వచ్చాయని పేర్కొన్నారు. ట్రిబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ తరహాలో ప్రధాని మోడీ, పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గుంతలు లేని రహదారులను తయారు చేస్తున్నామని, రెండు రోజుల్లోనే 40 కిలోమీటర్ల రోడ్డు వేసి రికార్డు సృష్టించామని తెలిపారు.

ట్రూ డౌన్ పేరుతో విద్యుత్తు బిల్లుల భారం తగ్గించామన్నారు. రూ.4,500 కోట్లు పెంచుకోమని ఇఆర్‌సి అనుమతి ఇస్తే, ప్రజాప్రయోజనాల దృష్ట్యా వద్దని చెప్పామని తెలిపారు. భవిష్యత్తులోనూ కరెంటు ఛార్జీలు పెంచబోమని మరోమారు స్పష్టం చేస్తున్నామన్నారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు పేరిట సుపరిపాలన అందించేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. జగ్గన్నపేట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండగగా ప్రకటించామన్నారు. సంక్రాంతికి కోడి పందేలు సంప్రదాయమే కానీ, జూదాల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపీ జి.హరీష్‌మాథూర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయుల కంటే ముందే ఆదివాసీ దేవతల చరిత్ర

వరంగల్.అమృత్ తెలంగాణ:ఆదివాసీ వీర వనితలు, కాకతీయులతో యుద్ధం చేసి చనిపోలేదని.. అసలు కాకతీయుల చరిత్రతో మేడారం సమ్మక్క, సారలమ్మకు ఎలాంటి సంబంధం లేదని సమ్మక్క, సారలమ్మ రీసెర్చ్ ఇన్సిట్యూట్ ఫౌండర్, పరిశోధకులు మైపతి అరుణ్ కుమార్ నవతెలంగాణ ప్రతినిధికి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం అరుణ్ కుమార్‌ను 'నవ తెలంగాణ' ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. ఈ సందర్భంగా ఆయన మేడారం చరిత్ర పరిశోధనలో వెల్లడైన విషయాలను వివరించారు. సమ్మక్క, సారలమ్మ.. కాకతీయ రాజు ప్రతాపరుద్రుడితో యుద్ధం చేసి మరణించినట్టు జరిగిన ప్రచారం తప్పేనని అంగీకరించారు. సమ్మక్క, సారలమ్మ చరిత్ర క్రీస్తు పూర్వం 9,030 నాటిదని వివరించారు. సమ్మక్క, సారలమ్మ చరిత్రపై 15 ఏండ్లుగా పరిశోధనలు చేసినట్టు చెప్పారు. మొత్తం 30 మంది పరిశోధకులం ఈ పరిశోధనలో భాగస్వాములయ్యామని తెలిపారు. 101 రాజ్యాలను సమ్మక్క పాలించినట్టు చెప్పారు. సమ్మక్క, సారలమ్మ పూర్వీకుల చరిత్ర బేరంబోయిన రాజు నుంచి ప్రారంభమైందని, ఈయనే వంశవృక్షన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. బేరంబోయిన రాజుకు ఆరుగురు కుమార్తెలు. ఒక్కో కుమార్తె వివాహం చేసి ఒక్కో వంశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాయబండని రాజు, రసమలాదేవిలకు మేడరాజు, సాంబశివ మహారాజు అనే ఇద్దరు కుమారులున్నారు. మేడరాజుకు సందం బోయిరాలు, కనకం బోయిరాలు అనే ఇద్దరు భార్యలున్నారు. సందం బోయిరాలుకు బిడ్డలు లేరు. తనకు బిడ్డలు కావాలని బేరంబోయిన రాజును వేడుకుంటుంది. బేరంబోయిన రాజు ఆదేశాలతో సాంబశివ మహారాజు, తూలముత్తికి పుట్టిన సమ్మక్కను చిలకలగుట్టపై వెదురువనంలో పుట్ట వద్ద పెట్టి వస్తారు. ఆ బిడ్డను మేడరాజు, సందం బోయిరాలు తెచ్చుకొని తమ బిడ్డగా పెంచుతారు.



సమ్మక్కది 5వ గొట్టు అని వివరించారు. మేడరాజు రెండో భార్యకు కనకం బోయిరాలుకు కూతురు నాగులమ్మ, కమారుడు జంపయ్య ఉన్నారు. సమ్మక్కను కొత్తగూడ మండలం పూనుగొండ్లకు చెందిన పగిడిద్దరాజుకు ఇచ్చి వివాహం చేయాలని నిర్ణయిస్తారు. ఇందుకు సమ్మక్క అంగీకరించకపోవడంతో రెండో బిడ్డ నాగుల మ్మను పగిడిద్దరాజుకు ఇచ్చి వివాహం చేస్తారు. అనంతరం సమ్మక్క పగిడిద్దరాజును అంగీకరించడంతో ఆయన్ను వివాహమాడింది. పగిడిద్దరాజు 4వ గొట్టు. గోవిందరాజులు.. పగిడిద్దరాజు తమ్ముడు. కానీ గతంలో గోవిందరాజులు సారలమ్మ భర్తగా ప్రచారం జరిగింది. ఇది వాస్తవం కాదన్నారు. సమ్మక్కకు సారలమ్మ అనే కూతురు పుట్టింది. సారలమ్మది 3వ గొట్టు. నాగుల మ్మకు జంపన్న, మూయన్న అనే ఇద్దరు కుమారులున్నారు.

## మహిళా ఉద్యమాల్లో పురుషులను భాగస్వాములను చేయాలి

హైదరాబాద్: అమృత్ తెలంగాణ:మహిళా ఉద్యమాల్లో పురుషులను భాగస్వాములను చేయాలని ప్రముఖ జర్నలిస్ట్ సి.వనజ సూచించారు. మహిళలకు పురుషులు, పురుషులకు మహిళలు శత్రువులనే భావనలను సమాజంలోకి జొప్పిస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి భావనలను తిప్పికొట్టాల్సిన అవసరముందనీ, ఆ దిశగా మహిళా సంఘాలు ఆలోచించాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.నాగలక్ష్మి అధ్యక్షతన మహిళల భద్రత -- ప్రభుత్వాల వైఖరి అనే అంశంపై ఆమె మాట్లాడారు. మహిళా ఉద్యమాలు, కమ్యూనిస్టులు మహిళలను సాధికారత దిశగా ప్రోత్సహించాయనీ, ప్రస్తుతం ఆ సాధికారత సాధించిన మహిళల పట్ల పురుషుల ఎలా ఉండాలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత మిగిలి ఉందని ఆమె గుర్తుచేశారు.




సమాజంలో జరిగే పరిణామాలకు ప్రభుత్వాలదే బాధ్యత అని వనజ తేల్చి చెప్పారు. మహిళలపై హింస ఒక సమస్యగా పరిగణించని సమాజంలోకి వచ్చామని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. స్త్రీ, పురుషులు ఒకరికొకరు శత్రువులనే ఆలోచనలను పెంచుతున్నారని తెలిపారు. మహిళలపై హింస అకస్మాత్తుగా జరిగే ఘటనలు కాదనీ, ప్రతి రోజు రిహార్సల్స్ జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాటాలతో దిగొచ్చిన పాలకవర్గాలు కంటితుడుపుగా చట్టాలు తెచ్చినా అవి అమలు కావడం లేదన్నారు. మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించే చట్టం ఉన్నా దేశవ్యాప్తంగా ఒక శాతం కూడా అమలు కావడం లేదన్నారు. చట్టాలు అమలు కాకుండా సమాజంలో పెద్దలు, పోలీసులు, చివరకు కొన్ని సందర్భాల్లో న్యాయస్థానాలు కూడా రాజీ చేసుకోమని సూచిస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మార్పు కోసం ప్రగతిశీల శక్తులు ఇంట్లో, స్కూళ్లో జెండర్ సెన్సిటివిటీ పెరిగేలా అవగాహన కల్పించే చదువును చెప్పించాలని కోరారు. సీపీఐ(ఎం) వల్లే వనజ వనజ ఉందంటే అది సీపీఐ(ఎం) చలువేననీ వనజ తెలిపారు. తమ ఊరికి సీపీఐ(ఎం) రాకుంటే నేడు వనజ లేదని తెలిపారు. వంద శాతం బాల్య వివాహాలు జరిగే గ్రామంలో జన్మించిన తాను రైతు కూలీ సంఘం రాజకీయ తరగతులను మూడు రోజుల పాటు శ్రద్ధగా వినడం, పుస్తకాలను చదివడం ద్వారా దాని నుంచి బయటపడిగలిగినట్టు చెప్పారు.

మార్క్సిజం సిద్ధాంతం వెలుగులో ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నానని ఆమె తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయం రిటైర్డ్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆవుల మంజులత మాట్లాడుతూ సమాజంలో అసమానతలు ఎంత ఎక్కువగా ఉన్నాయో భాషలో తెలుస్తుందన్నారు. పౌరాణికాల్లో వివాహమైన రాజుకు భార్యతో పాటు మరో 8 మంది స్త్రీలను పంపించే వారని ఉందన్నారు. స్త్రీలకు స్వేచ్ఛ లేదనీ, వారిని ఒక సొత్తుగా మాత్రమే పరిగణించే పరంపర కొనసాగిందని గుర్తుచేశారు. తెలుగు భాషలో మహిళలకు, జడ పదార్థాలకు ఒకే రకమైన పదాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అసమానతులను పొగొట్టేందుకు పోరాడిన స్త్రీలెందరో ఉంటే, వారికి సహకరించిన పురుషులెందరో ఉన్నారని ఆమె గుర్తుచేశారు. ఇప్పటికీ సమాజంలో అసమానతలు కొనసాగుతున్నాయనీ, వాటిని అధిగమించడానికీ, స్త్రీ–పురుషుల్లో సమాజం పట్ల అవగాహన పెరగాలని మంజులత అభిప్రాయపడ్డారు. అలాంటి అవగాహన పెంచే చదువు లభిస్తే పోరాడే శక్తి వస్తుందన్నారు. అధ్యయనానికి ప్రాధాన్యమివ్వాలి–పుణ్యవతిపనితో పాటు అధ్యయనానికి ప్రాధాన్యతనివ్వాలని ఐద్వా ఆల్ ఇండియా కోశాధికారి పుణ్యవతి సూచించారు. ఆధునిక మహిళ భారతదేశాన్ని మారుస్తుందన్న గురజాడ మాటలను నిజం చేయాలని కోరారు. ఇంట్లో పెద్దలు చేసే దాన్నే పిల్లలు చేస్తారనీ, చిన్నప్పటీ నుంచే అసమానతల భావనలు లేకుండా పెంచాలన్నారు. ఐద్వా హైదరాబాద్ సిటీ సెంట్రల్ కమిటీ క్యాలెండర్ ను వనజ, మంజులతలు ఐద్వా నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

## నకిలీ నెంబర్ ప్లేట్లు, నంబర్ ప్లేట్లు లేకుండా, నంబర్ ప్లేట్లు టాంపరింగ్ చేసి వాహనాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవు.

ఇప్పటివరకు ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలో ఏడు కేసుల నమోదు.
నిన్న టూ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ముగ్గురు అరెస్ట్.
నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపిన నంబర్ ప్లేట్లు మార్చి వాహనాలు నడిపిన చట్టప్రకారం చర్యలు.
నిబంధనలు ఉల్లంఘించిన వారి వాహనాలు కోర్టులో డిపాజిట్ చేయబడతాయి.
ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ నిబంధనలు ఉల్లంఘించి వాహన నంబర్లు మారుస్తూ, నంబర్ ప్లేట్లు టాంపరింగ్ చేస్తూ, నకిలీ నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసి వాహనాల నడిపిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి హెచ్చరించారు. ఇప్పటివరకు ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలో ఏడు కేసులు నమోదు అయినట్లు అందులో నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. శుక్రవారం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఒక వాహనానికి రిజిస్ట్రేషన్ లేకుండా ఫేక్ నెంబర్ ప్లేట్ తో తిరుగుతూ ఉన్నటువంటి యజమానిని దానిని అమ్మిన వారిని నలుగురిపై కేసు నమోదు చేసి, ముగ్గురిని అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ నంబర్ ప్లేట్లను వినియోగించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి వాహనాలను సీజ్ చేసి కోర్టులో డిపాజి చేయబడతాయని తెలిపారు.



# సర్పంచులకు సన్మానం.....

## నర్సాపూర్ జి మండల సర్పంచ్లను సన్మానించిన 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ ప్రమోద్ చంద్ర రెడ్డి,........




సర్పంచులను సన్మానించిన వైద్యులు



సర్పంచ్ల సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న 30 పడకల ఆసుపత్రి సూపర్డెంట్ ప్రమోద్ చంద్ర రెడ్డి

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి జనవరి 9 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల కేంద్రంలోని 30 పడగల ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరిండెంట్ ప్రమోద్ చందర్ రెడ్డి, నూతనంగా ఎన్నికైన సర్పంచులకు సన్మానం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచులు ఆస్పత్రి అభివృద్ధి కోసం సాయ సహకారాలు అందించాలని పేద రోగులకు వారు సలహాలు సూచనలు ఇస్తూ పేదలు మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందేలా సాధారణ ప్రసవాల కొరకు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాలని సర్పంచ్లను కోరా రు ఈ కార్యక్రమంలో ఆర్ ఎం అరవింద్ డాక్టర్ ముఖేష్ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి ప్రభాకర్ ఆయా గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్లు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# అన్ని శాఖల సమన్వయంతో నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





నిర్మల్ జిల్లా ఉత్సవాల సమీక్ష సమావేశంలో అధికారులతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ జిల్లా జనవరి 9 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా అధికారులందరూ సమన్వయంతో పనిచేసి నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులందరితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం పెద్ద ఎత్తున నిర్మల్ ఉత్సవాల్లో పాల్గొనే విధంగా విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. నిర్మల్ జిల్లా చరిత్ర తెలియజెప్పేలా కార్యక్రమాలు ఏర్పాటుచేయాలన్నారు. ఈ నెల 19 వ తేదీ నుంచి 23 వ తేదీ వరకు నిర్వహించబోయే నిర్మల్ ఉత్సవాల కార్యక్రమానికి ప్రోటోకాల్ పాటిస్తూ, ప్రజాప్రతినిధులను, ప్రముఖులను ఆహ్వానించాలని చెప్పారు. సంతకాల బోర్డు, సెల్ఫీ పాయింట్ లు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండ ఉ ండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ప్రజల నుంచి స్వీకరించిన సూచనలను పరిశీలించారు. ఉత్సవాలకు వచ్చే సందర్శకుల సంఖ్యను ముందుగా అంచనా వేస్తూ, అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీఈవో భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సిపిఓ జీవరత్నం, డిపిఓ శ్రీనివాస్, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిఎంహెచ్ఓ రాజేందర్, అగ్నిమాపక అధికారి శివాజీ, ఉ ద్యానవన పంటల అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో జిల్లాలో టాప్ లో నిలవాలి: కలెక్టర్ రాజర్షి షా




సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



హాజరైన విద్యార్థిని విద్యార్థులు



చెట్టును నాటుతున్న దృశ్యం

అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో టాప్ లో నిలవాలనీ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం బేల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా దాతల సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్.ఓ వాటర్ ప్లాంట్ను కలెక్టర్ ప్రారంభి పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు వేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో జిల్లాలో మొదట 130 పాఠశాలల్లో ప్రారంభించిన 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమం, ప్రస్తుతం 250 పాఠశాలల్లో విజయవంతంగా అమలవుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని, తద్వారా విద్యార్థుల అనారోగ్య సమస్యలు తగ్గి, పాఠశాల హాజరు శాతం గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడా రంగంలోనూ రాణించాలని, క్రీడా రంగంలో రాణించడం ద్వారా స్పోర్ట్స్ కోటలో ఉద్యగాలు సాధించవచ్చన్నారు. సిఎం కప్ క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆయన ఆకాంక్షంచారు. రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో బేల ఉన్నత పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, జిల్లాలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకోవాలని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పిలునిచ్చారు. పాఠశాల అభివృద్ధి కోసం దాతలు సుమారు 3 లక్షల రూపాయలు అందించారని, ఆ నిధులతో విద్యార్థుల కోసం స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందందనీయమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దాతలను శాలువాలతో సన్మానించి, ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు పాఠశాలలో కిచెన్ షెడ్, ఆరోగ్య పాఠశాల కార్యక్రమాలపై గోడలపై పెయింటింగ్ లను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, ప్రధానోపాధ్యాయులు కొమ్ము కృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం, దాతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పురాతన ప్రభుత్వ భవనాల కూల్చివేతకు అనుమతులు ఇవ్వండి .

## సంబంధిత అధికారులను కోరిన సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్........




పురాతన భవనాల కూల్చేతులకు అనుమతుల కొరకు సంబంధిత అధికారికి వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్

నిర్మల్ జిల్లా ముధోల్ జనవరి 9 అమృత్ తెలంగాణ ముధోల్ మండలంలోని అష్ట గ్రామ పరిధిలో శిథిలావస్థకు చేరుకుని ప్రజలకు ప్రమాదకరంగా మారిన ప్రభుత్వ భవనాలను కూల్చివేయడానికి అనుమతులు మంజూరు చేయాలని అష్ట గ్రామ సర్పంచ్ . రావుల లావణ్య శ్రీనివాస్, ఇంచార్జ్ ఎంపీడీఓ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాలను ఇంచార్జ్ ఎంపీడీఓ కు సర్పంచ్ కు వినతి పత్రం అందజేశారు. శిథిలావస్థలో ఉన్న భవనాల వల్ల ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడుతున్నందున, వాటిని తొలగించి భవిష్యత్తులో గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గ్రామ అభివృద్ధి, ప్రజల రక్షణే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఇంచార్జ్ ఎంపీడీఓ అశోక్, నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు, సహకారం అందించి త్వరితగతిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# సర్పంచ్ ను సన్మానించిన అంగన్వాడీలు

## చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించాలని అంగన్వాడీలను కోరిన సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్........




సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ ను సన్మానిస్తున్న అంగన్వాడీలు

నిర్మల్ జిల్లా ముధోల్ జనవరి 9 అమృత్ తెలంగాణ ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తలు సంగీత, దమయంతి, కడెలా దేవికలతో పాటు ఆయా సుజాత కలిసి గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్, ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్, అంగన్వాడీల పనితీరు, చిన్నారుల సంరక్షణ, పౌష్టికాహారం పంపిణీ, గర్భిణీ మహిళలకు అందిస్తున్న సేవలు తదితర అంశాలపై వివరలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని చిన్నారుల ఆరోగ్యం, శారీరక–మానసిక అభివృద్ధిలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని ఆయన ప్రశంసించారు. అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి ఏవైనా సమస్యలు, అవసరాలు, సదుపాయాల కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి పంచాయతీ స్థాయిలో పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శికి కూడా అంగన్వాడీ కార్యకర్తలు సన్మానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం తనిఖీ : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఈవీఎం గోదాంను సంబంధిత అధికారుల తో కలిసి తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ జిల్లా జనవరి 9 అమృత్ తెలంగాణ నిర్మల్ కలెక్ట రేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని శు క్రవారం, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. ఎల్లప్పుడు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ హైస్కూల్ లో జాతీయ రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రాజేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఈ సందర్భంగా అధికారులు రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, నాలుగు చక్రాల వాహనాల్లో సీటుబెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ వంటి అంశాలపై విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. విద్యార్థులు బాధ్యతాయుతంగా రోడ్డు ప్రయాణం చేయాలని, తమ తల్లిదండ్రులు కూడా రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడడంలో సీపీఆర్ (జూ=) ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ అంశం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. అలాగే రోడ్డు భద్రతా అంశాలపై నిర్వహించిన ఎలోక్యూషన్,

రంగోలి, స్కిట్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి విద్యార్థులు, రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీఓ శ్రీనివాస్, ఆర్టీఏ సభ్యుడు రాజేశ్వర్, ఎంఈఓ సోమయ్య, ఎఎంవిఐ హరింద్రకుమార్, ఎఎంవిఐ నిహారిక, సెక్టోరియల్ ఆఫీసర్ తిరుపతి, డాక్టర్ దీపిక, సిస్టర్ గ్రేస్, ప్రిన్సిపల్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్యాక్రాంతమైన భూములు స్వాధీనం

### అసలైన లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి: పేదలు, గిరిజనులకు ప్రభుత్వం కేటాయించిన భూములను అక్రమంగా ఆక్రమించినా, తప్పుడు మార్గాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఇతరుల పేరిట అక్రమంగా బదిలీ అయిన భూములను స్వాధీనం చేసుకుని, అసలైన లబ్ధిదారులకు కలెక్టర్ పట్టాలు అందజేశారు ఆదిలాబాద్ రూరల్ మండలం అనుకుంట గ్రామానికి చెందిన అడ్డురి రమణ బాయి (భర్త: అశోక్)కు ప్రభుత్వం భూమి కొనుగోలు పథకం ద్వారా సర్వే నంబర్ 83లో 1 ఎకరం 15 గుంటల భూమి కేటాయించగా, సదరు భూమిని మరొక వ్యక్తి చట్టవ్యతిరేకంగా తన పేరిట పట్టా చేసుకున్నాడు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి విచారణ చేపట్టిన అధికారులు అక్రమ పట్టాను రద్దు చేసి, తిరిగి అడ్డురి రమణ బాయి పేరిట పట్టా జారీ చేశారు. అలాగే సిరికొండ మండలానికి చెందిన కుమరం జంగు బాపు (తండ్రి: సుంగు)కు చెందిన సర్వే నంబర్ 57/ూ/1లోని 6 ఎకరాలు 18 గుంటల భూమిని పలువురు వ్యక్తులు మోసపూరితంగా తమ పేరిట పట్టా మార్చుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భూభారతి చట్టం కింద అప్పీల్ విచారణ చేపట్టి, అక్రమంగా పొందిన పట్టాలను రద్దు చేసి, తిరిగి కుమరం జంగు బాపుకు భూమి పట్టా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కలెక్టర్‌కు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారంలో చొరవ చూపిన ఆర్డీఓ స్రవంతి, ఆదిలాబాద్ రూరల్, సిరికొండ తహశీల్దార్లు గోవింద్ నాయక్, తుకారాం లను జిల్లా కలెక్టర్ అభినందించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆయా మండలాల తహశీల్దార్లు, లబ్ధిదారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు నైపుణ్యం అవసరం: జిల్లా కలెక్టర్





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి విద్యతో పాటు నైపుణ్యం కలిసినప్పుడే యువత జీవితంలో స్థిరత్వం, గౌరవం లభిస్తాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం తాంసి మండల కేంద్రంలో షిర్డీ సాయి సేవా సంస్థ, రామనంద తీర్థ గ్రామీణ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీలు సరిపోవని, వాటితో పాటు ప్రయోజనకరమైన నైపుణ్యాలు ఎంతో అవసరమని చెప్పారు. యువత భవిష్యత్తు అభివృద్ధికి నైపుణ్య శిక్షణలు కీలకమని, ఇవి వారి కలలకు వేదికగా నిలుస్తాయని అన్నారు. ఈ ప్రాంత యువత ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా శిక్షణలు అందించడం అభినందనీయమని అన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధిని పొందడంతో పాటు కుటుంబాలకు బలమైన ఆధారంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్వామి రామనంద తీర్థ గ్రామీణాభివృద్ధి సంస్థ చైర్మన్ కిషోర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సంతోష్ రెడ్డి, ఉప సర్పంచ్ గంగారెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు దెబ్బడి అశోక్, గంగాధర్, రాజేష్, సారిక, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా జిల్లా యంత్రాంగం

### భవానీగూడలో కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా చలి దుప్పట్ల పంపిణీ





దుప్పట్లు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్

అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి జిల్లాలోని నిరుపేదలకు, అవసరార్థులకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం బేల మండలంలోని భవానీగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, పేదలకు చలి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. చలికాలంలో తమ అవసరాలను గుర్తించి దుప్పట్లు పంపిణీ చేసినందుకు కలెక్టర్ కు, అధికారులకు ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, తహసీల్దార్ రఘునాథ్ రావు, ఎంపీడీవో ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ సునీత, పంచాయతీ కార్యదర్శి, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చైనా నిషేధిత మాంజా గురించి విస్తృత తనిఖీలు చేపట్టిన ఇబ్రహీంపట్నం పోలీసులు

### చైనా మాంజా అమ్మితే కేసు నమోదు .ఎస్సై అనిల్




ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ జనవరి 9: జగిత్యాల జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశానుసారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో పలు కిరాణా షాపులు , దుకాణాలలో నిషేధిత చైనా మాంజా గురించి తనిఖీలు నిర్వహించడం అయింది , చైనా మాంజా అమ్మినచో కేసులు నమోదు చేసి చట్ట పరమైన చర్యలుతీసుకోబడునని ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ హెచ్చరించడం అయినది.


## చైనా మాంజ మెడకు చుట్టుకుని బాలునికి తీవ్ర గాయాలు..



మెట్ పల్లి అమృత్ తెలంగాణ జనవరి 09: పట్టణంలోని దుబ్బవాడలో ఇంటి ముందు ఆడుకుంటున్న శ్రీహాస్ (4) అనే బాలుడి మెడకు చుట్టుకున్న చైనా మాంజా. నిజామాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు. శ్రీహాస్ మెడ చుట్టూ 20 కుట్లు వేసి చికిత్స చేసిన డాక్టర్లు.

## చైనా నిషేధిత వస్తువులు విక్రయించరాదు జగిత్యాల పోలీసుల విస్తృత తనికి.




జగిత్యాల అమృత్ తెలంగాణ జనవరి 09: పట్టణం లో జగిత్యాల జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శ్రీ డి. రఘు చందర్ ఎస్డిపిఓ జగిత్యాల సూచనల తో జగిత్యాల టౌన్ ఇన్స్పెక్టర్ పీ.కరుణాకర్ వారి యొక్క సిబ్బందితోపాటు జగిత్యాల పట్టణంలో వ్యాపార సముదాయ ప్రాంతాల్లో మరియు ఇతర షాపులలో ప్రజలకు, మూగజీవాలకు మరియు ఇతర జీవరాశులకు హాని కలిగించే ప్రభుత్వ నిషేధిత చైనా మంజాలు (పతంగులను ఎగురవేసే ప్లాస్టిక్ దారాలు)ఎవరైనా విక్రయిస్తున్నారా అని విస్తృత తనిఖీలు చేపట్టినారు. ఒకవేళ ప్రభుత్వ నిషేధిత చైనా మాంజా ను ఎవరైనా తీసుకువచ్చి ప్రజలకు విక్రయిస్తే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని జగిత్యాల టౌన్ పోలీస్ తెలియపరిచారు.


## ఆత్మకూరులో కబడ్డీ విజేతగా కొలనుపాక టీం

ఆలేరు రూరల్ ఆత్మకూరు (ఎం ) మండలంలో నిర్వహించిన ఆరుట్ల కమలాదేవి--రామచంద్రారెడ్డి స్మారక ఆలేరు నియోజకవర్గస్థాయి క్రీడోత్సవాల్లో భాగంగా జరిగిన కబడ్డీ పోటీల్లో కొలనుపాక టీం మొదటి బహుమతిని సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో ప్రత్యర్థి జట్లపై ఆధిపత్యం చూపిన కొలనుపాక ఆటగాళ్లు అద్భుత ప్రదర్శనతో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విజేత జట్టును అభినందించి బహుమతులు అందజేశారు. క్రీడల ద్వారా యువతలో క్రీడాస్ఫూర్తి, ఐక్యత పెరుగుతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు.

## మెట్ పల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపిఎస్.

### విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి

### నిషేధిత చైనా మాంజా అమ్మకం, వినియోగంపై చట్ట ప్రకారం కఠిన చర్యలు




మెట్ పల్లి అమృత్ తెలంగాణ జనవరి 09: జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆకస్మికంగా మెట్ పల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసుల నమోదు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పరిష్కరించాలని, నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసు డైరీలను, రిజిష్టర్ లను పరిశీలించి, రికార్డులన్నీ తనఖీ చేశారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు, యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరాల నివారణ, వారు ప్రస్తుతం వినియోగిస్తున్న నూతన పద్ధతులపై వివరించి వారిలో చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలన ఆక్సిడెంట్ జోన్ లుగా, బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలన్నారు.

సంక్రాంతి పండుగ సమయంలో చాలా మంది తమ స్వగ్రామాలకు లేదా బంధువుల ఇళ్లకు వెళ్లడం వల్ల ఇండ్లు ఖాళీగా ఉండే అవకాశముందని, ఈ పరిస్థితిని దొంగలు తమకు అనుకూలంగా మలుచుకునే అవకాశముంటుందని కావున ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు.

నిషేధిత చైనా మాంజా అమ్మకం, వినియోగంపై చట్ట ప్రకారం కఠిన చర్యలు.

ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా (నైలాన్ / సింథటిక్ దారాలు)ను విక్రయించినా, వినియోగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని,చైనా మాంజా విక్రయాలు, రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చైనా మాంజా వల్ల మనుషులతో పాటు పక్షలకు ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు. నైలాన్,సింథటిక్ దారాలు పర్యావరణానికి, పక్షులకు, మనుషులకు తీవ్రమైన హానిని కలిగిస్తాయని, గతంలో అనేక ప్రమాదాలు, ప్రాణనష్టాలు సంభవించిన దృష్ట్యా జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు చైనా మాంజా వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందని తెలిపారు. ఎవరైనా చైనా మాంజాను అమ్మినా, రవాణా చేసినా, నిల్వ ఉంచినా సంబంధిత సమాచారం ఉంటే తక్షణమే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 ఫోన్ చేసి సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎస్పి వెంట డిఎస్పి రాములు, మెట్ పల్లి సి.ఐ అనిల్ కుమార్, ఎస్.ఐ కిరణ్ కుమార్. సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐసిసి జనరల్ సెక్రెటరీ విశ్వనాథన్ ప్రత్యేక పూజలు

ఆలేరు : అమృత్ తెలంగాణ: యాదగిరిగుట్ట లక్ష్మనరసింహస్వామి దేవస్థానంలో ఏ ఐ సీ సీ జనరల్ సెక్రటరీ కాంచీపురం మాజీ ఎంపీ విశ్వనాథన్ ప్రత్యేక పూజలు జరిపారు. ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆలయ పూజారులు శుక్రవారం ఆలయం మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామివారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రజలకు సుఖ సంతోషాలతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని భగవంతుని ప్రార్థించినట్లు చెప్పారు. అనంతరం ప్రభుత్వ విప్ స్వగృహంలో కుటుంబ సభ్యులతో కలిసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ అనిత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జనగాం ఉపేందర్ రెడ్డి, ఆలేరు మండల పార్టీ అధ్యక్షులు కొండ్రజు వెంకటరాజు, కాంగ్రెస్ కార్యకర్తలు ఆలయ పూజారులు పాల్గొన్నారు.

# బీర్పూర్ మండలంలో పర్యటించిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి





బీర్పూర్ అమృత్ తెలంగాణ జనవరి 09: మండలంలోని అరగుండాల ప్రాజెక్టు ముత్తడిని జీవన్ రెడ్డి పరిశీలించారు అరగుండాల ప్రాజెక్ట్ తో రైతుల కండ్లలో ఆనందాలు ఇటీవల కాలంలో అరగుండాల ప్రాజెక్టు సందర్శించి మంత్రి తో మాట్లాడి నిధులు మంజూరు చేయించినారు మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ అరగుండాల ప్రాజెక్టు కింద తాళ్ల ధర్మారం చిత్రవేని గూడెం నీటి సౌకర్యం అరగుండాల ప్రాజెక్ట్ నిండుతేనే కానీ కిందికి నీరు పోయే అవకాశం ఉండదు కాలువ అమరమ్మత్తు చేపడితేనే కానీ నీరు పోయే అవకాశం లేకుండే గత వారం అరగుండాల స్లూయిస్ గేట్ పాడైపోవడంతోని అరగుండాల కాలువ మరమ్మత్తు చేపట్టడానికి నీరు వచ్చే విధంగా చర్యలు చేపట్టడం కొరకు దిగువ ప్రాంత రైతాంగం నా దృష్టికి తీసుకు రావడంతోని జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకుపోవడంతో అంతవరకు విడుదల ఉన్నటువంటి ఎస్సారెస్పీ మొదటి విడత సాగునీరు 2 రోజులు పొడిగిస్తే గాని అరగండాల ప్రాజెక్టుకు నీరు చేరుకునే అవకాశం లేకుండే వెంటనే అధికారులకు ఆదేశాలు జారీచేసి 2 రోజులు ఎస్సారెస్పీ నీరు విడుదల పొడిగింపు చేయడంతోనే ఈరోజు అరగుండాల ప్రాజెక్టుకు నీరు చేరుకొని నిండు కుండల కనపడుతుంది అన్నారు. కాలువ మరమ్మత్తు చేపట్టడం కూడా అత్యవసరం కాలువ మరమ్మత్తుకు సంబంధించి కూడా మంత్రి దృష్టికి తీసుకుపోవడంతో వారు వెంటనే తక్షణమే స్పందించి జిల్లా కలెక్టర్ తో మాట్లాడి కాలువ మరమ్మత్తులకు సంబంధించిన నిధులు జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధుల నుండి 2 లక్షల రూపాయలు మంజూరు చేయించడం జరిగింది ఈ వేసవి రబి క్రాప్ ఈ అర గుండాల ప్రాజెక్టుపై ఆధారపడినటువంటి రైతాంగం వారికి ఆశలు చిగురించాయి రబి పంట సాగుకు నీరు పొందబోతున్నారు ఆ ఆనందం వారి కళ్ళలో కనబడుతున్నది ఆనాడు ప్రాజెక్టు పరిశీలించి సంబంధిత అధికారుల సలహాలు సూచనలతోని స్లూయిజ్ మరమ్మత్తులు నీటి విడుదల రెండు రోజుల పొడగింపు చర్యలు చేపట్టడంతోని ప్రత్యేకంగా కాలువ మరమ్మతులు ఎలా చెయాలి నిధులు ఎలా అనే తరుణంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్ తో మాట్లాడి తక్షణమే కాలువ మరమ్మతుల నిధులు మంజూరు చేయించడం తోని రైతుల కండ్లలో ఆనందం చూస్తున్నాం,రైతుల పక్షన మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను అన్నారు,దీంతోపాటు అనుకోకుండా మంగేళ ట్రాన్స్ఫార్మర్ కమ్మునూరు ట్రాన్స్ఫార్మర్ గాని కాపర్ వైర్ దొంగలింపుకు గురైంది మంగేళ కమ్మనూరు లిఫ్ట్ ఇరిగేషన్ నీటి సదుపాయం ట్రాన్స్ఫార్మర్ రీస్టోర్ చేస్తేనే గాని నీటిని ఎత్తిపోతలు చేసే అవకాశం లేదు అన్నారు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయ జిన్నింగ్ లో సిసిఐ ను మోసగించిన నిందితుల అరెస్ట్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి తేదీ 15/12/2025 రోజున విజయ జిన్నింగ్ లో పనిచేస్తున్న 7 మంది వ్యక్తులు ఎలాగైనా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని పథకం ప్రకారం సీసీఐని మోసగించాలని ఉద్దేశంతో ఒక లోడు గల ట్రాక్టర్ ని రెండుసార్లు తూకం చేసి ఒక రైతు సహాయంతో అతని అకౌంట్లోకి డబ్బులు కొట్టించుకుని ప్రభుత్వ సంస్థ అయినటువంటి సి సి ఐ ని మోసగించడం జరిగినది. వ్యక్తుల వివరాలు మూలే మారుతి, చెర్ల అరుణ్ కుమార్, ఐద శివరాజ్, గోతి సునీల్, నవీన్ నీలేష్ మరియు వారికి సహకరించిన గోకుల నారాయణ వీరందరూ పథకం ప్రకారం 15 ,16 డిసెంబర్ తేదీలలో తూకం వేసిన లోడ్ ట్రాక్టర్ ను మళ్లీ తూకం వేసి దాదాపు 82 .6 క్వింటాళ్ల పత్తిని మోసగించి సీసీఐకి అమ్మినట్టు తప్పుడు అమ్మకం జరిపి 6,61,626/- రూపాయలను వారు ఆర్జించి స్వార్థానికి వాడుకున్నారు. ఇట్టి వ్యక్తులలో నలుగురు నిందితులు మూలే మారుతి, చెర్ల అరుణ్ కుమార్ ,ఐద శివరాజ్, రాథోడ్ నవీన్ లను ఈరోజు రిమాండ్ కి తరలించడం జరిగిందని ఇచ్చోడా సిఐ బి రాజు ఒక ప్రకటనలో తెలిపినారు



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## అర్హులందరికీ ఇండ్లు అందేలా కృషి చేస్తా



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ నెరడిగొండ మండలంలోని రాజురా గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందేలా కృషి చేస్తానని ఎవరు ఆదర్య పడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి




ఆలేరు రూరల్ అమృత్ తెలంగాణ:. ఎస్ఎఫ్ఐ ఆలేరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆలేరు పట్టణ కేంద్రంలోని శుక్రవారం గర్ల్స్ హైస్కూల్, బాయ్స్ హైస్కూల్,ప్రైమరీ స్కూల్‌లలో విద్యార్థినిలకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆలేరు మండల కార్యదర్శి కాసుల నరేష్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. విద్యార్థి రంగంలో ఉన్న సమస్యలపై పోరాటం చేయడమే కాకుండా, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే విధంగా ఎస్ఎఫ్ఐ పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు పుట్టల విద్యాసాగర్, సభ్యులు ఎం.డి.లతీఫ్, తిలకు సిద్ధు, రేగోటి ప్రశాంత్, రాజు కుమార్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏంటి జాన్వి ఫన్ కోసమే అలా చేస్తుందా..?



బాలీవుడ్ స్టార్ తనయ జాన్వి కపూర్ సినిమాతో ఈక్వల్ గా సోషల్ మీడియాలో తన పాపులారిటీ చూపిస్తుంది. సినిమాల లెక్క ఎలా ఉన్నా సరే సోషల్ మీడియా క్రేజ్ తోనే ఆమె అదరగొట్టేస్తుంది. అయితే జాన్వి మాత్రం రివర్స్ లో తను సోషల్ మీడియాని అసలు పట్టించుకోనని అంటుంది. జాన్వి కపూర్ ఇన్ స్టాగ్రాం లో 20 మిల్లియన్లకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. వారిని అలరించేందుకే రకరకాల ఫోటో షూట్స్ చేస్తుందేమో అనుకుంటే అసలు తను సోషల్ మీడియాని పట్టించుకోను.. తను కేవలం ఫన్ కోసమే ఫోటోలని సోషల్ మీడియాలో షేర్ చేస్తానని అంటుంది. గ్లామర్ ట్రీట్ తో ఫాలోవర్స్ ని వెర్రి వాళ్లని చేస్తున్న జాన్వి ఈ ఫోటోలు కేవలం ఫన్ కోసమే అంటూ చెప్పి షాక్ ఇచ్చింది. తను ఎంత సరదాగా ఫోటోలు షేర్ చేసినా ఫాలోవర్స్ మాత్రం వాటిని చాలా సీరియస్ గా ఫాలో అవుతున్నారు. జాన్వి ప్రతి ఫోటో షూట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ వస్తున్నాయి. గ్లామర్ ఎటాక్ లో జాన్వి తన ప్రత్యేకతని చూపిస్తుంది. స్టార్ కూతురు అయ్యుండి ఇలా రెచ్చిపోతే నెటిజెన్లు దారుణంగా కామెంట్స్ చేస్తారని తెలిసినా తను అనుకున్నది చేయడంలో వెనక్కి తగ్గట్లేదు జాన్వి కపూర్. అయితే ఈ ఫోటోలు అంతా కూడా తను కావాలని కాకుండా చాలా సరదాగానే షేర్ చేస్తున్నా అని చెప్పుకొచ్చింది. రీసెంట్ గా మిలి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన జాన్వి ఆ సినిమా ఫలితం ఎలా ఉన్నా ఆమె నటనకు మంచి మార్కులు కొట్టేసింది. ఇక సౌత్ సినిమాల మీద జాన్వి ప్రత్యేక ఆసక్తి చూపిస్తుంది. ఛాన్స్ వస్తే తెలుగు సినిమాలో చేయాలని అనుకుంటుంది అమ్మడు. ఇక్కడ ఎన్.టి.ఆర్ తో జత కట్టాలని జాన్వి ఇంట్రెస్ట్ చూపిస్తుంది. సినిమాల్లో కన్నా జాన్వి తన ఫోటో షూట్స్ లోనే తన అందాలకు పని చెబుతుంది. గ్లామర్ షో విషయంలో తనకంటూ ఒక పర్ఫెక్ట్ స్కెచ్ ఉన్నట్టుగా జాన్వి మాటలని బట్టి అర్ధమవుతుంది. రోజు రోజుకి తన స్కిన్ తోనే ఫాలోవర్స్ ని తన బుట్టలో పడేసుకుంటున్న అమ్మడు సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా తన క్రేజ్ కొనసాగిస్తుంది.

# టాలీవుడ్‌పై చాలా ఆశలు పెట్టుకుంది..!



ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తాను టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌ను అని, తనకు తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి అధికంగా ఆఫర్లు వస్తున్నాయని చెప్పుకొచ్చింది. మెగాస్టార్ చిరంజీవితో 'వాల్తేరు వీరయ్య' సినిమాలో బాస్ పార్టీ, బాలకృష్ణతో 'డాకు మహారాజ్' సినిమాలో దబిడి దిబిడి సాంగ్ చేయడం ద్వారా టాలీవుడ్‌లో మోస్ట్ పాపులర్ ఐటెం సాంగ్ హీరోయిన్‌గా ఊర్వశి రౌతేలా నిలిచింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో స్టార్ హీరోల సినిమాల్లో ఐటెం సాంగ్ అనగానే ఈ అమ్మడి పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఊర్వశి రౌతేలా మాస్ ఐటెం సాంగ్స్‌కి మంచి స్పందన వచ్చింది. ఇప్పటి వరకు తెలుగులో ఈమె చేసిన దాదాపు అన్ని సాంగ్స్ మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఎక్కువ ఆఫర్లు వస్తున్నాయి. పైగా హీరోయిన్స్ రేంజ్‌లో ఈమె పారితోషికంను అందుకోవడం కూడా కలిసి వచ్చే అంశంగా చెప్పుకోవచ్చు. పారితోషికం భారీగా దక్కుతున్న నేపథ్యంలో టాలీవుడ్‌లో ఐటెం సాంగ్స్ చేసేందుకు ఈమె చాలా ఆసక్తిగా ఉంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తాను టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌ను అని, తనకు తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి అధికంగా ఆఫర్లు వస్తున్నాయని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో తాను బిజీ స్టార్ అన్నట్లుగా జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన గొప్ప తాను తెగ చెప్పుకుంది. చాలా మంది దర్శకులు నన్ను సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి సినిమాల్లో నన్ను నటింపజేసేందుకు పోటీ పడుతున్నారంటూ కాస్త అతిగా వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం ఊర్వశి రౌతేలా చేసిన ఈ వ్యాఖ్యల గురించి ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. 60 డేస్ ప్లాన్! డాకు మహారాజ్ తర్వాత ఊర్వశి కొత్త సినిమాలతో వచ్చిందే లేదు. బ్లాక్ రోజ్ అనే సినిమాలో నటిస్తుంది. కానీ అది ఎప్పటికీ వస్తుంది అనే విషయమై క్లారిటీ లేదు. అయినా కూడా ఈ అమ్మడు టాలీవుడ్‌లో తనకు వచ్చే అవకాశాల గురించి, ముందు ముందు చేయబోతున్న సినిమాల గురించి చాలానే ఆశలు పెట్టుకుని ఉంది. హిందీలో ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తున్నప్పటికీ టాలీవుడ్ పైనే ఈమెకి మోజు ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఐటెం సాంగ్స్ స్పెషలిస్ట్‌గా పేరు దక్కించుకున్న ఈ అమ్మడు హీరోయిన్‌గానూ ఆఫర్లు వస్తాయేమో అనే నమ్మకంతో కనిపిస్తుంది. ముందు ముందు ఈ అమ్మడి జోరు ఏ రేంజ్‌లో ఉంటుందో చూడాలి. 2013లో సింగ్ సాబ్ ది గ్రేట్ అనే సినిమాతో బాలీవుడ్‌లో అడుగు పెట్టిన ఈ అమ్మడు దశాబ్ద కాలంలోనే అత్యధిక సినిమాల్లో నటించి మెప్పించింది. పలు సినిమాల్లో గెస్ట్ అప్పియరెన్స్, ప్రత్యేక సాంగ్స్ చేయడం ద్వారా కూడా మరింతగా పాపులారిటీని సొంతం చేసుకుంది. తమిళ్‌లో ఈమె ది లెజెండ్ అనే సినిమాలో ముఖ్య పాత్రలో నటించింది. ఆ తర్వాత తమిళ్ నుంచి ఆఫర్లు వచ్చినా కొన్ని కారణాల వల్ల తిరస్కరించినట్లు సమాచారం అందుతోంది. మొత్తానికి ఊర్వశి రౌతేలా హిందీ, తమిళ్, తెలుగు, బెంగాలీ భాషల్లోనూ నటించడం ద్వారా పాపులారిటీ సొంతం చేసుకుంది. కానీ ప్రస్తుతం ఈమెకు ఉన్న క్రేజ్ నేపథ్యంలో తెలుగు సినిమాలను ఎక్కువ చేయాలని ఆశ పడుతోంది.

# మమితా బైజు డిమాండ్ బాగుంది..!



ఐతే ఎవరైనా హీరోయిన్ తెలుగులో కాస్త క్రేజ్ తెచ్చుకుంటే చాలు వాళ్లకి వరుస ఆఫర్లు వస్తాయి. ప్రేమలు సక్సెస్ తో మమితాకు అలాంటి ఆఫర్లు వచ్చాయి. ప్రేమలు సినిమాతో సౌత్ లో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది క్యూట్ బ్యూటీ మమితా బైజు. దాదాపు ఏడెనిమిది ఏళ్లుగా మళయాళంలో నటిస్తూ వచ్చిన మమితా బైజు అక్కడ ఒక మోస్తారు క్రేజ్ తో కెరీర్ కొనసాగిస్తుండగా ప్రేమలు సినిమా ఎప్పుడైతే రిలీజైందో అప్పటి నుంచి అక్కడ మిగతా భాషల్లో కూడా అమ్మడి పాపులారిటీ పెరిగింది. తన క్యూట్ లుక్స్ తో యూత్ ఆడియన్స్ కి ఫేవరెట్ హీరోయిన్ అయ్యింది మమితా బైజు. ప్రేమలుతో తెలుగు యువత మనసులు కూడా గెలుచుకుంది ఈ చిన్నది. ఐతే ఎవరైనా హీరోయిన్ తెలుగులో కాస్త క్రేజ్ తెచ్చుకుంటే చాలు వాళ్లకి వరుస ఆఫర్లు వస్తాయి. ప్రేమలు సక్సెస్ తో మమితాకు అలాంటి ఆఫర్లు వచ్చాయి. కానీ అప్పటికే ఆమె తమిళం, మలయాళ భాషల్లో సినిమాలు ఓకే చేయడం వల్ల ఇక్కడ సినిమాలు కుదరలేదు. ఐతే మమితాకు కూడా పర్సనల్ గా తెలుగు సినిమాల్లో నటించాలన్న ఆలోచన ఉందని తెలుస్తుంది.

# అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

## చూపు తిప్పుకోనివ్వని అందం.. 90ఎంఎల్ ఇచ్చినంత కిక్



తెలుగు లో 90ఎంఎల్ సినిమా తో పాటు ఛలో ప్రేమిద్దాం సినిమాలను చేసిన ముద్దుగుమ్మ నేహా సోలంకి. ఈ అమ్మడు మెల్ల మెల్లగా టాలీవుడ్ ప్రేక్షకులకు చేరువ అవుతోంది. అందమైన ఈ అమ్మడి యొక్క అందాల గురించి ఎంత మాట్లాడుకున్నా తక్కువే అన్నట్లుగా ఈ ఫోటో చూస్తుంటే అనిపిస్తుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. సోషల్ మీడియాలో ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత పీక్స్ లో ఉంది. తాజాగా ఈ ఫోటోను షేర్ చేసి తనకంటే గొప్ప అందగత్తె ఉందా అన్నట్లుగా నేహా సోలంకి ఛాలెంజ్ విసిరినట్లు గా ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి. ప్రస్తుతం ముద్దుగుమ్మ యొక్క అందం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. క్లీ వేజ్ షో తో పాటు నడుము అందం ను సైడ్ యాంగిల్ లో చూపిస్తూ మతులు పోగొడుతున్న ముద్దుగుమ్మ అందాల విందు కు ప్రతి ఒక్కరు కూడా ఫిదా అవుతున్నారు. ఈ అమ్మడి యొక్క సినిమాల విషయానికి వస్తే గూడుపుఠాణి సినిమాలో నటిస్తోంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- sigidiamruth404@gmail.com